ఆకట్టుకోని వైజ్ఞానిక ప్రదర్శన

- 300ల ప్రదర్శనలు వస్తాయని అంచనా, 180 కూడా దాటని వైనం
- విద్యార్థులకు ఎండలోనే భోజనం
- రెండు రోజుల ముందే తేదీలు ఇవ్వడంతో గందరగోళం



ఎండలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో గురువారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలు సమాజ ప్రగతికి దోహదపడతాయని, పాఠశాల స్థాయి నుంచి శాస్త్ర సాంకేతిక అంశాలపై ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కొత్త అంశాలతో విద్యార్థులు ముందు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ రాణి, ఈఎంఓ బాలుయాదవ్, ఫాతిమా విద్యాలయ ప్రిన్సిపల్ థెరిస్సా, తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ప్రదర్శనలు

అధికారులు నామమాత్రంగా ప్రదర్శనలు నిర్వహించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రదర్శన ఎప్పుడు అనే అంశంపై చాలా రోజుల వరకు అధికారుల్లో స్పష్టత లేక పోవడంతో ప్రారంభానికి కేవలం రెండు రోజుల ముందు పాఠశాలల హెచ్‌ఎంలకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యార్థులకు ప్రదర్శనకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయలేకపోయారు. ప్రదర్శను వచ్చే విషయంలో ఇటు జిల్లా సైన్స్ అధికారి, హెచ్‌ఎంలు ఇతర అధికారులు పెద్దగా శ్రద్ధ పెట్టలేదన్న ఆరోపణలున్నాయి. 300లకు పైగా ప్రదర్శనలు వస్తాయనే అంచనా ఉండగా, కేవలం 180 కంటే తక్కువ ప్రదర్శనలు వచ్చినట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

స్టాల్స్ తిలకించేందుకు లేని విద్యార్థులు

వివిధ విభాగాలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయగా, చాలా చోట్ల రూంలలో స్టాల్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రదర్శనలు తక్కువగా రావడంతో స్టాల్స్ మిగిలిపోయాయి. అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రదర్శనలు చూసేందుకు విద్యార్థులను సమీకరించడంలో విఫలమయ్యారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించేందుకు టెంట్లు లేకపోవడంతో ఎండలోనే ఏర్పాటు చేశారు. ఇబ్బందులు లేకుండా శుక్రవారం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని డీఈఓ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్
- హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటన



హౌసింగ్ బోర్డు కాలనీలో మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక 3, 4వ వార్డుల పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ, వరద కాల్వ సరిగా లేదని, పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన ఈ సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి, కౌన్సిలర్ రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు శివశంకర్, హన్మంతు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

భూత్పూర్ రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గురువారం భక్తులకు అన్నదానం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు అశోక్‌యాదవ్, సంజీవ్, వెంకటాపూర్ శ్రీను, చంద్రకాంత్‌రెడ్డి, సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కృష్ణయ్యగౌడ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లింగంపేట మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకుని వారిని ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మండలంలో కేంద్ర బృందం పర్యటన



మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ములలో విచారణ చేస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మిడ్జిల్: మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై విచారణకు గురువారం మండల పరిధిలోని మల్లాపూర్, వెలుగొమ్ముల, భైరంపల్లి, దోనూర్ గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించి పనులను, రికార్డులను పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులు పరిశీలించారు. ప్రతి పనిని, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. గ్రామ ప్రజలను అడిగి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు శ్రీకాంత్, రాజ్‌కుమార్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్‌ను అందుకున్న కాటవరం యువకులు

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన యువకులకు చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ గురువారం క్రికెట్ కిట్‌ను అందజేయించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అంబటి బసదీశ్వర్‌తో క్రికెట్ కిట్‌ను పంపించడంతో ఆయన దాన్ని యువకులకు అందజేశారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఈ సందర్భంగా ఏసీపీ బంటు కిషన్ పేర్కొన్నారు. క్రికెట్ కిట్‌ను అందజేయించిన ఏసీపీకి స్థానిక యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

జడ్చర్ల టౌన్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో జేసీబీ సహాయంతో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించాలని ఆమె ఆదేశించారు. ప్రజలు బాధ్యతగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ ఉన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



మిడ్జిల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి



భూత్పూర్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మిడ్జిల్: క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, ఎంఈఓ సుధాకర్, హెచ్‌ఎంలు సరస్వతి, వెంకటయ్య, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, గౌస్, జహంగీర్, పర్వతాలు. ఆదాం, రాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

భూత్పూర్: నేటి విద్యార్థులకు క్రీడల్లో రాణించడానికి పాఠశాలల స్థాయి నుంచి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి పోటీలకు కర్వెన, ఎల్కిచర్ల, తాటిపర్తి, తాటికొండ, పోతులమడుగు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కోకో పోటీల్లో 14 మంది బాలికలు, 12 మంది బాలురు, కబడ్డీలో 14 మంది బాలికలు, 15 మంది బాలురు, వాలీబాల్‌లో 6 మంది బాలికలు, 13 మంది బాలురు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంపీఓ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, హర్యానాయక్ పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న నాయకులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన కొత్తబోరును గురువారం మాజీ ఎంపీపీ శాంతిబాయి ప్రారంభించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రాంలాల్, నాయకులు గోపాల్, పవన్, వేణు, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



జడ్చర్లలో సర్వే పరిశీలిస్తున్న కమిషనర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 10, 11 వార్డుల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన వారి జాబితాను సక్రమంగా సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పర్యవేక్షణలో వార్డు కౌన్సిలర్ జ్యోతి, కాంగ్రెస్ నాయకులు నిత్యానందం, జగదీశ్వర్‌చారిలు పాల్గొన్నారు.

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వినతులను యాప్ ద్వారా సర్వే చేయటం అధికారులు ప్రారంభించారు. గురువారం నుంచి ప్రారంభమైన సర్వే ఈ నెలాఖరు నాటికి వందశాతం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్క పంచాయతీ అధికారికి 5 వందల వినతులను సర్వే చేయాలని నిర్ణయించింది. 5 వందలకు మించితే అదనంగా మరొకరికి అవకాశం ఇవ్వాలని, వారి ద్వారా సర్వే చేయాలని నిర్ణయించింది. మండలంలో 54 గ్రామాల్లో 15418 మంది ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 8 గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతరుకుల యాప్ ద్వారా సర్వే చేసే అవకాశం కల్పించనున్నారు. తాజాగా గురువారం మండలంలో అన్ని గ్రామాల్లో కేవలం పంచాయతీ కార్యదర్శులు సర్వే చేశారు. సర్వేను ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని ఆదేశాలున్నాయి.

యాప్‌లో మూడు ఫొటోలు అప్లోడ్ చేయాలి

ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లిన వెంటనే యాప్‌లో వారి ఫొటో అప్లోడ్ చేయాలి. అనంతరం వారు నివాసం ఉంటున్న ఇంటి పరిస్థితి తెలిసేలా మరోఫొటో అప్లోడ్ చేయాలి. అనంతరం వారు కొత్తగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే నిర్మాణం చేయాలనుకునే స్థలంలో మరోఫొటోను అప్లోడ్ చేయాలి. ఇలా మూడు ఫొటోలతో అప్లోడ్ చేసిన తరువాతనే దరఖాస్తుదారుడి సర్వే పూర్తి అవుతుంది. ఇలా చేయటం వల్ల ఒక్క వ్యక్తికి డబుల్ ఇళ్లు, ఇల్లు ఉన్నా ఇందిరమ్మ ఇంటికి దరాఖాస్తు చేసుకుంటే వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. ఇల్లు మంజూరైన ఇంటి స్థలం లేని వారి జాబితా సిద్ధం చేయడం లాంటివి ఈ యాప్ ద్వారా సులువు కానున్నాయి. ప్రతిది యాప్‌లో ఉండటంతో అవకతవకలకు తావు లేకుండా చేయాలనేది ప్రభుత్వ నిర్ణయంగా భావిస్తున్నారు.

అభ్యంతరాల గడువు పూర్తి



రాజకీయనాయకులతో సమావేశమైన సూపరింటెండెంట్ వెంకట్‌ప్రసాద్

జడ్చర్ల టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికల సమాయత్తంలో భాగంగా పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. మండలంలో మొత్తం 45 గ్రామపంచాయతీలు, 376 వార్డులున్నాయి. వాటికి 376 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. పోలింగ్‌స్టేషన్లపై అభ్యంతరాలుంటే ఫిర్యాదులు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వరకు గడువు ఉండగా మండలంలో కేవలం మాటుబండతండా పంచాయతీ నుంచి మాత్రమే అభ్యంతరం వచ్చిందని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మాటుబండ తండా గ్రామ పంచాయతీకి వెళ్లేందుకు రోడ్డుమార్గం లేనందున అక్కడ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయరాదని తండావాసులు అభ్యంతరాన్ని మండల పరిషత్ సూపరింటెండెంట్ వెంకట్‌ప్రసాద్‌కు విన్నవించారు. ఉన్న 6 వార్డులకు, 6 పోలింగ్‌కేంద్రాలు ఒకేచోట ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చిన అభ్యంతరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ తెలిపారు. మాటుబండతండాను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

ఎన్నికల సమాయత్తంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సూపరింటెండెంట్ వెంకట్‌ప్రసాద్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధికార పార్టీ కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నాయకులు మాత్రమే హాజరయ్యారు. బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఇతర పార్టీల నాయకులు రాలేదు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని వారికి సూచించారు. తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలియజేశారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్

రాజాపూర్: రైతులు తాము సాగు చేసుకున్న వేరుశనగ పంటలో చీడపురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాజాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం రాజాపూర్ మండలంలోని ఈద్గాన్‌పల్లి, చంద్రగాన్‌తండాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో వేరుశనగ పంటను పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణంలో చలి తీవ్రత పెరిగినందున వేరుశనగలో టిక్కామచ్చతెగులు వచ్చే అవకాశముందని, కాండం కుళ్లు తెగులు, కుంకుమ తెగులు వచ్చే అవకాశాలున్నాయని, నివారణ చర్యల కోసం టిక్కా ఆకుమచ్చ తెగులు నివారణకు 400గ్రాములు మ్యాంకోజెప్, 200 గ్రాముల కార్బండిజం ఎకరానికి 200వందల లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న సాగు చేసుకున్న రైతులు కాండంపురుగు నివారణకు కోర్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలను మొక్క సుడిలో వేసుకోవాలన్నారు. కత్తెర పురుగు నివారణకు కోరాజిన్ 40మిల్లీ లీటర్లు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటితో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈఓ రమేష్‌రెడ్డి, రైతులు రామ్‌లాల్, మహేష్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మిడ్జిల్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలు ఈనెల 14న జడ్చర్లలో నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షులు వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు సరస్వతి, వెంకటయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత జడ్చర్ల



ఫుట్‌బాల్ విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నిరంజన్

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ 2024 టోర్నీ ఫుట్‌బాల్ విజేతగా జడ్చర్ల జట్టు నిలిచింది. బుధవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తతండా, జడ్చర్ల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జడ్చర్ల విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర పీడీ పీఈటీ సంఘం అధ్యక్షుడు నిరంజన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బాదేపల్లి బాలికల జెడ్పీహైస్కూల్‌లో యోగాసనాలు ఆకట్టుకున్నాయి. అథ్లెటిక్స్‌లోనూ విజేతలను జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నారు. పోటీలను ఎంపీడీఓ విజయ్‌కుమార్ పర్యవేక్షించగా పీడీ రాంకల్యాణ్, మోయిన్, తదితరులు ఉన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కమిటీ ఎన్నిక

మిడ్జిల్: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మండల నూతన కమిటీని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షులు మహేష్ తెలిపారు. గౌరవాధ్యక్షులుగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షులుగా భీంరాజ్, పరంజ్యోతి, కోశాధికారిగా శ్రీను, కార్యదర్శులుగా శేఖర్, నందన్, వై.శ్రీనువాసులు, శ్రీనునాయక్, సభ్యులుగా బాల్‌నారాయణ, కేశవ్, నిస్సార్, రాఘవేందర్, నిరంజన్, మల్లేష్, తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్చర్ల అధ్యక్షులు నరేందర్‌గౌడ్, రమేష్, సందీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును రద్దు చేయాలి



తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి గ్రామ ఊక చెట్టువాగు నుంచి ఇసుక తరలింపును రద్దు చేయాలని కురుమూర్తి గ్రామ రైతులు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు గోపాల్, కుర్మన్న, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ గ్రామ సమీపంలోని ఊక చెట్టు వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాగు నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడగంటి పోతాయన్నారు. వాగు పరిసరాలలో బోరు బావులు ఎండిపోయి సాగు, తాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇసుక తరలింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తిరుపతయ్యగౌడ్, కృష్ణయ్య, రాము, నరేందర్‌జీ, గొల్ల బాలస్వామి, తిమ్మన్న, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మిడ్జిల్: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో కళాశాల అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుట తల్లిదండ్రులు గొడవ పడొద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదవిన వారు ఎంతో మంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, తహసీల్దార్ రాజు, కళాశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య, నాయకులు వెంకటయ్య, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో జేడీ విచారణ



నంచర్ల పశువైద్యశాలలో విచారిస్తున్న జేడీ

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ జేడీ మధుసూదన్‌గౌడ్ గురువారం విచారణ చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎల్‌ఎస్‌ఏ జనార్దన్ విధి నిర్వహణలో చేసిన పొరపాట్ల వల్ల సస్పెండ్ అయ్యాడు. ఈ మేరకు జేడీ నంచర్లకు చేరుకొని సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రహ్లాద్, మాజీ సర్పంచ్ నారాయణ, సిబ్బంది ప్రవీణ్‌కుమార్, నరేందర్, నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ విరాళం



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు గురువారం గుడిగాన్‌పల్లి గ్రామానికి చెందిన బాల్‌శంకర్, రఘు కలిసి వాటర్ ఫిల్టర్‌ను విరాళంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతికి అందజేశారు. పాఠశాల విద్యార్థులకు విరాళంగా వాటర్ ఫిల్టర్‌ను అందజేయడంపై సంతోషం వెలుబుచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, గౌస్, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, జహంగీర్, శివ, ఆదాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



నవాబుపేట: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని, అందులో కొనసాగటం పూర్వ జన్మసుకృతమని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బదిలీపై వెళ్తున్న ఎంఈఓ రాజునాయక్‌కు వీడుకోలు, కొత్తగా వచ్చిన ఎంఈఓ నాగ్యానాయక్‌కు స్వాగతం కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎంఈఓ నాగ్యానాయక్, బదిలీపై వెళ్లిన ఎంఈఓ రాజునాయక్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాములు, యాదయ్య, భూపతిసింగ్, సదాశివుడు, విజయ్‌కుమార్, రవిశంకర్, విష్ణు, గోపాల్ ఉన్నారు.

ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ విడుదల

నవాబుపేట: ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. ఆపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 17న హైదరాబాద్‌లో నిర్వహించే దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యానాయక్, దశరత్‌నాయక్, చంద్రకళ, ఆపాస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సుధీర్, శ్రీనివాస్, మణికుమార్ ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనకు మద్దతు



మహబూబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిబ్బంది రెండు రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధన్‌మోహన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డిలు వారికి సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. వారితో పాటు తపస్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యుగేందర్‌గౌడ్, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మామిళ్ల లక్ష్మణ్, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



మహబూబ్‌నగర్ రూరల్: సేవాలాల్ సేన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా కేతావత్ రఘునాయక్‌ను నియమించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సేవాలాల్ సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌తో రఘునాయక్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గిరిజన జాతి సంక్షేమం, సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధన కోసం పని చేస్తానని తెలిపారు.